క్లుప్తంగా

నేటి నుంచి ఎన్నికల ప్రచారం

వీరఘట్టం: మండలంలోని దశుమంతపురం, సంత–నర్సిపురం, చినగోరకాలనీ, మూలలంక, చలివేంద్రి పంచాయతీల్లో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి శుక్రవారం ఎన్నికల ప్రచారం చేపట్టనున్నట్లు ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ఈ ప్రచారంలో పాల్గొంటారని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ అభిమానులు, కార్యకర్తలు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొనాలని కోరారు.

సారా పట్టివేత

సీతంపేట: మండలంలోని పెద్దబగ్గ సమీపంలో 20 లీటర్ల సారా తరలిస్తున్న ఊయక భాస్కరరావును అరెస్ట్ చేసినట్లు ఎస్సై జగదీష్‌నాయుడు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ, గ్రామానికి చెందిన ఊయక నరసింహ ఇంటిలో కూడా 40 లీటర్ల సారా పట్టుబడిందన్నారు. సారాను సీజ్ చేసి నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో జైగురుదత్త హోమం

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని శ్రీషిర్డీసాయి బాబా ఆలయంలో జైగురుదత్త హోమం గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ తదితర పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ అర్చకులు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురుదత్త హోమం చేపట్టారు. ప్రముఖ యజ్ఞకర్త ఎస్.వి.ఎల్.ఎస్ శర్మయాజీ సహకారంతో గత రెండేళ్లుగా ఈ హోమం నిర్వహిస్తున్నారు. ఈ హోమంలో పాల్గొనడం వల్ల బాధలు తొలగి, సంతోషమైన జీవితం లభిస్తుందని అర్చకులు తెలిపారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదానం చేశారు.

సక్రమంగా పింఛన్ల పంపిణీ



మాట్లాడుతున్న ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం

వీరఘట్టం: ఏప్రిల్ 3వ తేదీ నుంచి జరగనున్న పింఛన్ల పంపిణీని సక్రమంగా చేపట్టాలని ఎంపీడీఓ ఎంవీవీ సుబ్రహ్మణ్యం సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేసేటప్పుడు ఎటువంటి ప్రచారం చేయకూడదని, ఈ విషయాన్ని వారికి తెలియజేయాలన్నారు. ఎన్నికల నిబంధనలు పాటిస్తూ పింఛన్ల పంపిణీ సకాలంలో పూర్తయ్యేలా చూడలాని సూచించారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

గరుగుబిల్లి: వేసవి నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపడుతున్నట్లు ఎంపీడీవో పి.సూర్యనారాయణ తెలిపారు. ఇదే విషయమై ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ క్రాస్‌ప్రోగ్రాంలో భాగంగా ప్రతీ గ్రామానికి ప్రత్యేక వాహనం ద్వారా వెళ్లి, పాడైన తాగునీటి బోర్లను బాగుచేయిస్తున్నామన్నారు. ఎక్కడైనా మరమ్మతులకు గురైన బోర్లు ఉంటే తెలియజేయాలని, బోర్లకు సంబంధించి, సామగ్రి, విడి భాగాలు మండల పరిషత్ కార్యాలయంలో అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు.

వైభవంగా శివలింగాల ప్రతిష్ఠ

భామిని: మండలంలోని బత్తిలి సమీపంలో గల లలితా త్రిపుర సుందరీదేవి ఆలయ ప్రాంగణంలో అష్టాదశ శత శివలింగాలను గురువారం ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. సాయిసుధాకర్ పూర్ణానంద స్వామీజీ ఆధ్వర్యంలో అర్చకుడు రంపా శ్రీనివాసశర్మ పర్యవేక్షణలో వేద పండితులు శివలింగాలను ప్రతిష్ఠించారు. అనంతరం ఆలయ ధర్మకర్త వమరవిల్లి లక్ష్మీనారాయణను సత్కరించారు.

కోటదుర్గమ్మ ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు



నగదు లెక్కిస్తున్న అధికారులు, భక్తులు

పాలకొండ రూరల్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పాలకొండ కోటదుర్గమ్మకు భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను గురువారం లెక్కించారు. దేవదాయ శాఖ కార్యనిర్వహణాధికారి బి.మురళి నేతృత్వంలో ఈ ప్రక్రియ చేపట్టారు. 32 రోజుల వ్యవధిలో 4 లక్షల 18 వేల 208 రూపాయల ఆదాయం వచ్చింది. కార్యక్రమంలో దేవస్థానం ప్రధాన అర్చకుడు దార్లపూడి లక్ష్మీప్రసాద్‌శర్మ, రికార్డు అసిస్టెంట్ శ్రీనివాసరావు, కె.లత, భక్తులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనృసింహ స్వామి

సీతానగరం: మండలకేంద్రంలో సువర్ణముఖి నదీతీరాన వెలసిన లక్ష్మీనృసింహ స్వామి గురువారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు పి.శ్రీనివాసాచార్యులు ఈ మేరకు మాట్లాడుతూ లక్ష్మీనృసింహ స్వామి వారికి గురువారం ప్రీతికరమైన రోజు కావడంతో ప్రత్యేకంగా అలంకరించినట్లు తెలిపారు. ప్రతి గురువారం స్వామివారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాలనుంచి పూజాసామగ్రితో వివిధ రకాల వాహనాలతో భక్తులు తరలివచ్చి పూజల్లో పాల్గొంటున్నారని చెప్పారు.

తాగునీటి సమస్యకు

శాశ్వత పరిష్కారం..



టీకే రాజపురంలో పూర్తవుతున్న రక్షిత మంచినీటి పథకం నిర్మాణం



ప్రజలకు తాగునీటిని అందించేందుకు సిద్ధమైన అట్టలి వాటర్ ట్యాంక్



మల్లివీడులో సిద్ధమవుతున్న వాటర్ ట్యాంక్

- గ్రామీణ ప్రజలకు సురక్షిత నీరు అందించేందుకు కసరత్తు
- యుద్ధ ప్రాతిపదికన మంచినీటి ట్యాంక్‌ల నిర్మాణాలు



గదబవలస గిరిజన గ్రామంలో సిద్ధమైన మినీ రక్షిత పథకం



చినకోటిపల్లిలోని రక్షిత మంచినీటి పథకం

పాలకొండ రూరల్: మండలంలోని అభివృద్ధి పనుల పురోగతిపై ప్రజా ప్రతినిధులు, అధికారులు సంయుక్తంగా కసరత్తు చేపడుతున్నారు. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించేలా చర్యలు చేపట్టారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల పల్లెల్లో కనీస మౌలిక వసతులు కరువయ్యాయి. ముఖ్యంగా తాగునీటి సమస్య గ్రామీణులను ఎక్కువగా పీడించేది. వేసవి వచ్చిందంటే పల్లె ప్రజలు హడలిపోయేవారు. ఈ పరిస్థితుల్లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక పరిస్థితి మారింది. రెండేళ్లు కరోనా కోరలు చాచినా, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సమున్నత లక్ష్యాలను సాధించేలా అడుగులు ముందుకు వేశారు. ప్రజల కనీస అవసరమైన తాగునీటి అవసరాలకు ప్రాధాన్యం కల్పించారు. ఈ క్రమంలో పాలకొండ మండలంలోని 32 పంచాయతీల్లో గల 62 గ్రామాల్లో తాగునీటి సమస్యకు పరిష్కారం చూపారు. ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి సూచనల మేరకు గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు 99 పనులు చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం రూ. 14 కోట్ల 13 లక్షల 57 వేల రూపాయలతో ప్రణాళికలు సిద్ధంచేసి గ్రామాల్లో రక్షిత మంచినీటి పథకాలకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా 21 ప్రాంతాల్లో ఉన్న నీటి వనరులను సద్వినియోగపర్చుకుంటూ ఆయా గ్రామాల్లో ఇంటింటి కుళాయిలు వేస్తున్నారు. ఇందుకు రూ.2 కోట్ల 32 లక్షల 54 వేలు ఖర్చు చేయనున్నారు. అలాగే 37 గ్రామాల్లో నూతనంగా రక్షిత పథకాల పనులు యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నారు. ఆర్‌బీఆర్.పేట, అట్టలి, అవలంగి, టీడీ.పారాపురం, జి.వెంకటాపురం, డోలమడ, నక్కపేట, పారాపురం, గరుగుబిల్లి, ఎం సింగుపురం, మల్లివీడు, గుడివాడ, పెద్ద కోటిపల్లి, పరుశురాంపురం, టీకే.రాజపురం, వాటపాగు, పీఆర్.రాజుపేట, వీపీ.రాజుపేట, గదబవలస, చంద్రాయవలసతో పాటు మరికొన్ని గ్రామాల్లో ట్యాంక్‌లు నిర్మిస్తున్నారు. ఆయా గ్రామాల్లో జనాభా ప్రాతిపదికన 10 నుంచి 60 వేల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంకులు ఏర్పాటు చేస్తున్నారు. దీనికి సంబంధించి 6 కోట్ల 49 లక్షల 93 వేల రూపాయలు ఖర్చు చేయనున్నారు. వీటితో పాటు మరో 41 పనులు (ప్రజల అవసరం మేరకు తాగునీటి కుళాయిలు అదనంగా అందించేందుకు) గుర్తించారు. దీని కోసం 5 కోట్ల 31లక్షల 10 వేల రూపాయలు కేటాయించినట్లు డీఈఈ పి. ఢిల్లేశ్వరరావు తెలిపారు. జలజీవన్ మిషన్‌లో భాగంగా పనులకు సంబంధించిన నిధులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అందిసున్నాయి. పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు రక్షిత నీరు అందిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ కె.విన్నిప్రవళిక తెలిపారు.

మాతా, శిశు ఆరోగ్యాభివృద్ధిపై దృష్టి సారించాలి

- డీఎంహెచ్‌ఓ జగన్నాథరావు



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ జగన్నాథరావు

వీరఘట్టం: మాతా, శిశు ఆరోగ్యాభివృద్ధిపై వైద్య సిబ్బంది దృష్టి సారించాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి బి.జగన్నాథరావు సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం పీహెచ్‌సీ వైద్యాధికారి ఉమామహేశ్వరి, వైద్య సిబ్బందితో మాట్లాడుతూ, ప్రిజమ్ –10పై అవగాహన కల్పించారు. ఏడాది లోపున్న చిన్నారుల్లో రక్తహీనత రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా డ్రై రేషన్ అందించాలన్నారు. ప్రతి నెలా ఇళ్లకు వెళ్లి చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించాలని స్పష్టం చేశారు.

వినహాయింపు ఇవ్వాలి..



ఏఆర్‌ఓ వరహాలకు వినతిపత్రం అందిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

పాలకొండ: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గ పరిధిలోని మహిళా ఉపాధ్యాయులకు విధి నిర్వహణలో మినహాయింపు ఇవ్వాలని ఏపీటీఎఫ్ పాలకొండ మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శాసపు వాసుదేవరావు, గోగుల సూర్యనారాయణ, తదితరులు కోరారు. ఈ మేరకు ఏఆర్‌ఓ కె.వరహాలను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. గర్భిణులు, చిన్న పిల్లల తల్లులు, అనారోగ్యంతో బాధపడుతున్నవారు, ఆరు నెలల్లో పదవీ విరమణ చేయనున్న వారిని విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. దీనిపై ఏఆర్‌ఓ స్పందిస్తూ, విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు బీవీ.రమణ, కె.పద్మజ, నాగమణి, రామలక్ష్మి, నిర్మలాకుమారి పాల్గొన్నారు.

శిశుమరణాలు తగ్గించడమే ప్రిజమ్-10 లక్ష్యం



అంగన్‌వాడీ కార్యకర్తలతో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీవో సుగుణకుమారి

గరుగుబిల్లి: గర్భిణులు, బాలింతలు, కిశోరి బాలికల్లోని రక్తహీనత నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని కొమరాడ ఐసీడీఎస్ పీవో జి.సుగుణ కుమారి సూచించారు. గురువారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం–2లో సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశమైన ఆమె మాట్లాడుతూ పదేళ్ల లోపు వయసున్న శిశుమరణాల రేటును తగ్గించడమే ప్రిజం–10 లక్ష్యమన్నారు. వైద్యారోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, మహిళా సమాఖ్య, స్వయం సహాయక సంఘాల సభ్యులతా సమష్టిగా పనిచేసి, ప్రిజం–10ను విజయవంతం చేయాలన్నారు. హైరిస్క్ గర్భిణుల ఆరోగ్యం ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ వారి మెరుగైన ఆరోగ్యానికి సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పౌష్టికాహారం తప్పనిసరిగా వారికి అందజేయాలన్నారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ ఆర్.లక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు వెంటనే చెల్లించాలి

కురుపాం: ఉపాధి హామీ వేతనదారుల బకాయిలు వెంటనే చెల్లించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కోరాడ ఈశ్వరరావు, వేతనదారులు డిమాండ్ చేశారు. ఇదే విషయమై మండలంలోని గుజ్జువాయి పంచాయతీ బారామణిగూడ వద్ద గిరిజన సంఘం నాయకుడు ఊలక వాసుదేవరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు పత్తిక రామయ్య ఆధ్వర్యంలో వేతనదారులు గురువారం నిరసన చేపట్టారు. పని చేసిన 14 రోజులకే బిల్లులు చెల్లించాలి కానీ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం ఉల్లంఘిస్తోందని విమర్శించారు. కేరళలో వేతనదారులకు రోజువారీ కూలి రూ.600 చెల్లించి అన్నిరకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారని, అదే తరహాలో ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఉపాధి హామీ పథకం అమలు చేయాలని కోరారు.

అప్రమత్తంగా వ్యవహరించాలి



మాట్లాడుతున్న కురుపాం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రమణ

కురుపాం: ఎన్నికల విధుల నిర్వహణలో సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని కురుపాం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, పాలకొండ ఆర్‌డీవో వి.వి.రమణ సూచించారు. గురువారం స్థానిక ఆదర్శ పాఠశాలలో జియ్యమ్మవలస, కొమరాడ మండలాలకు చెందిన పోలింగ్, అసిస్టెంట్ పోలింగ్ అధికారులకు ఎన్నికల విధుల నిర్వహణకు సంబంధించి, శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈవీఎంల వినియోగం, నిర్వహణ, వీవీ ప్యాడ్స్, మార్క్ కాపీ కావడం తదితర అంశాలపై ఇచ్చే ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇదిలా ఉండగా, నియోజకవర్గంలో మొత్తం 39 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామని, ఆయా కేంద్రాల పరిధిలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. 1788 మందిపై బైండోవర్ కేసులు కూడా నమోదు చేశామన్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ఎన్నికల నిర్వహణ కోసం 683 మంది పీవో, ఏపీవోలకు రెండు దఫాలుగా శిక్షణ ఇస్తున్నామన్నారు.

గరుగుబిల్లి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎన్నికల విధుల నిర్వహణకు సంబంధించి, పీవోలు, ఏపీవోలకు ఇస్తున్న శిక్షణను కురుపాం నియోజకవర్గ ఎన్నికల రిటర్నిగ్ అధికారి, పాలకొండ ఆర్‌డీవో వి.వి.రమణ గురువారం పరిశీలించారు. శిక్షణలో నేర్పిస్తున్న ప్రతీ అంశాన్ని చక్కగా నేర్చుకుని, పోలింగ్ రోజున ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి పైల సూర్యనారాయణ, తహసీల్దార్ కె.జయ, మండల విద్యాశాఖాధికారి ఎస్.నాగభూషణరావు, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



ఆంధ్రా–ఒడిశా సరిహద్దులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద తహసీల్దార్ రమేష్ తదితరులు

కొమరాడ: ఎన్నికల వేళ వాహన తనిఖీలను పోలీసులు ముమ్మరం చేశారు. ఆంధ్రా–ఒడిశా సరిహద్దు ప్రాంతమైన కూనేరు చెక్‌పోస్ట్‌ను తహసీల్దార్ ఆర్.రమేష్ గురువారం సందర్శించి, అక్కడ నిర్వహిస్తున్న తనిఖీలపై ఆరాతీశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం పరిమితికి మించి డబ్బు, మద్యంతో పాటు ఎన్నికల తాయిలాలు వంటివి రవాణా కాకుండా చూడాలని తెలిపారు. గ్రామాల్లో కూడా ఎన్నికల నిబంధనలపై అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో ఉప తహసీల్దార్ శివయ్య తదితరలు పాల్గొన్నారు.

పాచిపెంట పీహెచ్‌సీ తనిఖీ

పాచిపెంట: స్థానిక పీహెచ్‌సీని ఎన్‌సీవీబీడీసీ ఉప సంచాలకుడు ఎ.టి.రామనాథరావు గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను ఆయన పరిశీలించారు. సాధారణ, మలేరియా జ్వరాలు ప్రబలుతున్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిసారించాలని వైద్యసిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట జిల్లా మలేరియా అధికారి డా.టి.జగన్మోహనరావు,డాక్టర్ వెంకటరమణ తదితరులు ఉన్నారు.

శక్తి ఆదాపై అవగాహన

భామిని: మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో ఎనర్జీ కన్జర్వేషన్ (శక్తి ఆదా) అనే అంశంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ రఘుపాత్రుని శివకుమార్ పర్యవేక్షణలో నిర్వహించిన సదస్సులో భావితరాలకు అవసరాలకు సరిపడా శక్తిని కాపాడుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. శక్తి ఆదాతో పాటు సహజ వనరులను పరిరక్షించుకొవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జి.బాబూరావు, సైన్స్ టీచర్ పి.రవికిశోర్, మువ్వల జానకి పాల్గొన్నారు.



ప్లకార్డులతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

సంక్షేమ పథకాలను చూసి ఓటెయ్యండి

- పాలకొండ ఎమ్మెల్యే కళావతి



కొత్తగూడలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి కళావతి

సీతంపేట: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి ఓటు వేయాలని పాలకొండ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని పూతికవలస, చిన్నబగ్గ, మర్రిపాడు, పులిపుట్టి, తదితర గ్రామాల్లో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికీ వెళ్లి ఓటు వేయమని కోరారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన జగనన్నకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రజలకు ఎంతోమేలు చేశారని చెప్పారు. మీ ఇంటికి మంచి జరిగితేనే ఓటు వేయని కోరిన ధైర్యవంతుడు జగన్ మోహన్‌రెడ్డి అని కొనియాడారు. టీడీపీ హయాంలో రైతులు, డ్వాక్రా మహిళలకు చంద్రబాబునాయుడు మోసం చేయగా.. జగన్ మోహన్‌రెడ్డి మాత్రం ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేసి అండగా నిలిచారని తెలిపారు. ఎమ్మెల్యేగా తనను, ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.ఆదినారాయణ, పార్టీ మండల కన్వీనర్ సుమిత్రారావు, ఏఎంసీ చైర్మన్ హెచ్.మోహనరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

దూసుకుపోతున్న డి.శిర్లాం

- పంచాయతీలో జోరుగా అభివృద్ధి కార్యక్రమాలు
- ఆనందంలో పంచాయతీ ప్రజలు



ప్రారంభమైన గ్రామ సచివాలయం

మక్కువ:

మండలంలోని డి.శిర్లాం పంచాయతీ అభివృద్ధి దిశగా పరుగులు తీస్తోంది. గతంలో ఎన్నడూ జరగని విధంగా పంచాయతీ పరిధిలో ఇంటింటి కుళాయిల ఏర్పాటు, సీసీరోడ్లు, కాలువలు, గ్రావెల్ రోడ్లు, కల్వర్టులు, గ్రామసచివాలయం, రైతుభరోసా కేంద్రం, రహదారుల పనులకు ప్రభుత్వం నిధులు మంజూరుచేసింది. గతంలో తాగునీటి కోసం గ్రామస్తులు ఇబ్బందులు పడేవారు. అయితే గ్రామంలో ఇంటింటి కుళాయిలు ఏర్పాటుచేయడంతో తాగునీటి సమస్య పూర్తిగా తీరిందని మహిళలు సంతోషం వ్యక్తంచేస్తున్నారు. అలాగే గ్రామంలో రూ.35లక్షలతో సచివాయం నిర్మించి ప్రజలకు సేవలందిస్తున్నారు. లోవరఖండిలో రూ.2.50లక్షలతో సీసీరోడ్డు నిర్మాణం జరిగింది. డి.శిర్లాం గ్రామంలో చినవీధి, బీసీకాలనీలో రూ.26లక్షలతో కాలువల ఏర్పాటు, ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో రూ.4.50 లక్షలతో సీసీరోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. రూ.21లక్షలతో రైతుభరోసాకేంద్రం నిర్మాణం చేపట్టారు. డి.శిర్లాం నుంచి లోవరఖండి మీదుగా దబ్బగెడ్డ వరకు రూ.6.50 కోట్లతో రహదారి, డి.శిర్లాం నుంచి, పార్వతీపురం మండలం కొత్తవలస వరకు రూ.1.50కోట్లతో రహదారి నిర్మాణం జరుగుతోంది.



డి.శిర్లాం నుంచి దబ్బగెడ్డ వరకు జరుగుతున్న రహదారి పనులు

రోడ్ల నిర్మాణంతో తొలగనున్న ఇబ్బందులు



డి.శిర్లాం గ్రామం నుంచి, లోవరఖండి మీదుగా దబ్బగెడ్డ వరకు, డి.శిర్లాం నుంచి, పార్వతీపురం మండలం కొత్తవలస గ్రామం వరకు రహదారుల నిర్మాణం చేపట్టారు. గతంలో ఆయా రహదారులు పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో, రహదారులపై ప్రయాణించాలంటే వాహనచోదకులు అనేక ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం వైట్‌మిక్సర్ పనులు జరిపించారు. రహదారి పనులు పూర్తయితే ఇబ్బందులు తీరుతాయి.

వాసిరెడ్డి అప్పలనాయుడు, ఎంపీటీసీ, డి.శిర్లాం

అభివృద్ధి చెందిన పంచాయతీ

మా పంచాయతీ పరిధిలో అభివృద్ధిపనులు జరిపించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరుచేయడంతో చాలా అభివృద్ధి చెందింది. గ్రామంలో సీసీరోడ్లు, కాలువలు, ఇంటింటి కుళాయిలు ఏర్పాటు చేసుకున్నాం. ప్రజలకు ఇబ్బందులు లేకుండా సచివాలయం ద్వారా సమస్యలన్నీ, అధికారులు పరిష్కరిస్తున్నారు. రైతుభరోసా కేంద్రం పనులు త్వరలో పూర్తిచేసి, రైతులు సమస్యలు తొలగిస్తాం.

గేదల రాధిక, సర్పంచ్, డి.శిర్లాం



గ్రామంలో ఏర్పాటుచేసిన ఇంటింటి కుళాయిలు



గ్రామంలో నిర్మించిన సీసీరోడ్డు